

రోడ్డు నిర్మాణం పనులు పరిశీలిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

రోడ్డు పనులు పరిశీలించిన ప్రజాప్రతినిధులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ 15వ డివిజన్ పరిధిలో గల ఆర్చిడ్ కాలనీలో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులను సోమవారం మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలోనూ పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వచ్చే ఏడాదిలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు హైదరాబాద్ సీ - డాక్‌లో టెక్ కాన్‌క్లేవ్

కొత్తపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ వారి సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ - డాక్) హైదరాబాద్ 25వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు, టెక్ కాన్‌క్లేవ్ ఈనెల 13న (మంగళవారం) నిర్వహించనున్నారు. పహాడీషరీఫ్ కేశవగిరి సమీపంలో హార్డ్‌వేర్ పార్క్ (శ్రీశైలం హైవే)లోని సీ డాక్ కాంప్లెక్స్‌లో మంగళవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని మీడియా కోఆర్డినేషన్ కమిటీ తెలిపింది. సీ - డాక్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో టెక్ ఎక్స్‌పో డెమో, సీనియర్ అధికారులు సీ-డాక్ నిర్వహించే కార్యక్రమాలపై వివరిస్తారన్నారు. 13వ తేదీన ఉదయం సీ డాక్ కాంప్లెక్స్‌కు చేరుకునేందుకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నుంచి మీడియా ప్రతినిధుల కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మైనారిటీ గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఏప్రిల్ వరకు గడువు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ సూర్యోదయనగర్ కాలనీలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల (బాలానగర్ గర్ల్స్-1)లో ఇంటర్మీడియట్ మొదట సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లలో ప్రవేశానికి గడువును ఏప్రిల్ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వినీల తెలిపారు. మైనారిటీ, నాన్ మైనారిటీ విద్యార్థినులు తమ కళాశాలలో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 9160255040, 9154365042 నంబర్లలో సంప్రదించాలన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు చైతన్యవంతులు కావాలి

- జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు

హయత్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో సోమవారం హయత్‌నగర్ జిల్లాపరిషత్ పాఠశాలలో జిల్లా స్థాయి చిత్రలేఖనం, ఉపన్యాసం, కథలు, పాటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషి జీవితంలో ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు చైతన్యవంతులు కావాలన్నారు. ముఖ్యంగా చెత్తను తగ్గించడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు తగ్గించడం, ఆరోగ్య అలవాట్లు, సుస్థిరమైన ఆహార వ్యవస్థ, వాడి పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలపైన పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, శంకరయ్య, రాజిరెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జైళ్లశాఖ ఐజీ మురళి బాబు, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్‌కి అవార్డు అందజేస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు

'చర్లపల్లి' స్టాల్‌కు ఉత్తమ అవార్డు

కుషాయిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న 93వ అఖిల భారత పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన-2024లో ఏర్పాటు చేసిన చర్లపల్లి జైలు స్టాల్‌కు రాష్ట్ర ప్రభుత్వ స్టాళ్ల కేటగిరీలో ఉత్తమ అవార్డు లభించింది. సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీ ఎన్.మురళీబాబుకు మంత్రి జూపల్లి కృష్ణారావు అవార్డును అందజేశారు. పది సంవత్సరాలుగా 'మై నేషన్' పేరిట జైళ్ల శాఖ ఉత్పత్తుల స్టాల్‌ను ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేస్తున్నారు. ఈ అవార్డు అందుకోవడం రెండోసారి అని చర్లపల్లి సూపరింటెండెంట్ ఎస్.కె.రాయ్ తెలిపారు. జైళ్లలో ఖైదీలు తయారు చేస్తున్న ఫర్నీచర్, వస్త్రాలు, శానిటరీ ఉత్పత్తులకు ప్రజాదరణ లభించడం గర్వకారణమని ఆయన అన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ ఠాకూర్, ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ టి.కళాసాగర్, చంచల్‌గూడ మహిళా జైలు సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి ఐదు రోజులు టిప్పర్ లారీల సమ్మె

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఓవర్ లోడ్‌ను అరికట్టి పాసింగ్ లోడ్‌కు మాత్రమే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సమ్మెను ప్రకటించింది. ఈమేరకు సోమవారం అసోసియేషన్ సభ్యులు సద్దుపల్లి వద్ద ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సమ్మెను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఐదు రోజులపాటు అన్ని రకాల టిప్పర్ లారీలు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ సమ్మెకు డాంబర్ ప్లాంట్లు, క్రషర్స్ యాజమాన్యాలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మెకు వ్యవతిరేకంగా టిప్పర్లను నడిపిస్తే అసోసియేషన్ తరఫునా రూ.25 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లింగం, సత్తిరెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వీరేశంగుప్త, మచ్చేందర్‌రెడ్డి, లింగమయ్య, ఆనంద్‌రెడ్డి, సైదులు, శంకర్‌రెడ్డి, సత్యనారాయణ, జైపాల్‌రెడ్డి, శివరాజు, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు

మురుగు.. పరుగు

- మూడు నెలలుగా పొంగి పొర్లుతున్న డ్రైనేజీ నీరు
- జీహెచ్ఎంసీలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



డ్రైనేజీ నీటి ప్రవాహం



దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చైతన్యపురి మెట్రో స్టేషన్ నుంచి జీహెచ్ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారికి కూత వేటు దూరంలో డ్రైనేజీ నీరు మూడు నెలలుగా పొంగి పొర్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చిన్నపాటి కాలువలా రోడ్డుపై పారుతున్న మురుగు కంపును భరించలేకపోతున్నామని కాలనీవాసులు పదుల సంఖ్యలో జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి ఫలితం లేదు. దీంతో మూడు నెలలుగా డ్రైనేజీ దుర్వాసనతో సరస్వతీనగర్ కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని సరస్వతినగర్, నేతాజినగర్, కృష్ణవేణినగర్, సరూర్‌నగర్ చౌడీ, పోచమ్మబస్తీ కాలనీవాసులు రాకపోకలు సాగించే నేతాజినగర్-సరూర్‌నగర్ చౌడీ ప్రధాన రహదారిపై డ్రైనేజీ మురుగు నీటి ప్రవాహం నివారణ కోసం చర్యలు చేపట్టాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి సైతం అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విశేషం.

విద్యార్థులకు అగచాట్లు..

దుకాణదారులకు గిరాకీ నిల్..!

సంస్కృతి పాఠశాల సమీపంలోని సరస్వతినగర్ కాలనీ రోడ్డు నెం.3 వద్ద ఉన్న ఓ కిరాణ దుకాణం ముందున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ గత మూడు మాసాలుగా పొంగుతుండడంతో మురుగు నీరు ఆ ప్రధాన రహదారిపై ప్రవహిస్తుంది. దీంతో రెండు, మూడు చోట్ల మురుగు నీరు పేరుకుపోవడంతో పాటు ముక్కుపుటలదిరే దుర్వాసన వెదజల్లుతుంది. దీని మూలంగా ఓవైపు ఆ మురుగు నీటి రహదారిగుండా సంస్కృతి పాఠశాలకు వచ్చిపోయే విద్యార్థులు, తల్లిదండ్రులు నానా ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు అక్కడున్నటువంటి మెడికల్ షాపు, పాల దుకాణం, కిరాణ దుకాణాల ముందు మురుగు నీరు ప్రవహిస్తుండడంతో మూడు నెలలుగా వినియోగదారులు రావడంలేదని దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పది, పదిహేను సార్లు సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లి శానిటేషన్ అధికారులకు, సిబ్బందికి డ్రైనేజీ నీటి నివారణకు చర్యలు చేపట్టాలని విన్నవించామని స్థానికులు వాపోతున్నారు. గడ్డిఅన్నారం కార్పొరేటర్ అక్కడకు వచ్చి సమస్య తీవ్రతను పరిశీలించినప్పటికీ ఇంతవరకు అధికారులు చర్యలు చేపట్టలేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాల నుంచి ఈస్ట్ జోనల్ కమిషనర్ కార్యాలయానికి వచ్చిపోయే జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది ఈ రహదారిగుండానే రాకపోకలు సాగిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకమీదటైనా జీహెచ్ఎంసీ అధికారులు డ్రైనేజీ నీటి నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్నాం



కాలనీ లోపలకు వెళ్లాలంటే ఈ మురుగునీటిలో నుంచి వెళ్లాల్సి వస్తుంది. ఆ డ్రైనేజీ నీటి నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నాం. ఇప్పటికే అధికారులకు చాలా సార్లు ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ ఏ ఒక్కరు కూడా సమస్యను పరిష్కరించలేదు. డ్రైనేజీ పరిష్కారం కోసం అధికారులు చొరవ చూపాలి.

-శ్రీనివాస్, స్థానికుడు

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

- మలక్‌పేట ఆర్టీఏ ఎంవీఐ రమేష్‌బాబు



రోడ్డు భద్రత నిబంధనలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్న ఎంవీఐలు రమేష్‌బాబు, నరేందర్‌పాల్, ఉమా, ముని, అరుణ

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క వాహనాదారునికీ రోడ్డు భద్రతపై అవగాహన అవసరమని, అప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతారని మలక్‌పేట ఆర్టీఏ ఎంవీఐ రమేష్‌బాబు అన్నారు. సోమవారం మలక్‌పేట ఆర్టీఏ కార్యాలయంలో రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని జేటీసీ రమేష్ పర్యవేక్షణలో మలక్‌పేట ఈస్ట్ జోన్ ఆర్టీవో సుభాష్‌చందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. రోడ్డుపై వాహనంతో నడుపుకుంటూ వచ్చిన మరుక్షణమే రోడ్డు భద్రత నిబంధనలను ఆచరించాలన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతోపాటు మద్యం సేవించి వాహనం నడపరాదన్న నిబంధన పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే జైలుశిక్ష పడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని రమేష్‌బాబు సూచించారు. నిబంధనల ప్రకారం వాహనాలను నడిపితే అసలు రోడ్డు ప్రమాదాలే జరగవన్నారు. డ్రైవింగ్ సమయంలో నిద్రవస్తున్నట్లు తెలిసిన వెంటనే వాహనాన్ని పక్కకు ఆపుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా తొందరగా గమ్యాన్ని చేరుకోవాలన్న తాపత్రయంతో వాహనం నడిపితే తనతో పాటు ఎదుటివారిని ప్రమాదానికి గురిచేసి ప్రాణాపాయం కలిగించినవారవుతారనే విషయాలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ నరేందర్‌పాల్, ఉమ, మున్నీ, రజినీ, సైదా, ఏవోలు విజయకుమార్, ప్రవీణ్, మధుకర్, జైపాల్‌రెడ్డి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రథమ మహాసభను జయప్రదం చేయండి

- రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి



సమావేశంలో మాట్లాడుతున్న వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రథమ వార్షికోత్సవ మహాసభను విజయవతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగం కోరారు. సోమవారం వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం కొత్తపేటలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాండురంగం మాట్లాడుతూ కార్మిక కర్షక రాజ్యాధికారం దక్కాలంటే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మార్చి 3వ తేదీన జరిగే వార్షికోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్, బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్, హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌దుర్గే, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగయ్య ముదిరాజ్, ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, నరసింహాచారి, ఎస్వీ రాములు, కార్యదర్శులు యాదయ్య, రమేష్, సోమేశ్వరరావు, మహ్మద్ కిర్మణ్, కృష్ణమాచారి, మహిళా సమాఖ్య కన్వీనర్ శశికళ, రామాచారి, మల్లాచారి రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో డ్రగ్స్ కట్టడికి వ్యూహం

- యాంటి ర్యాగింగ్ తరహాలో యాంటి డ్రగ్ కమిటీలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టీనేజీలో ఉన్న పిల్లలు చెడు అలవాట్లు త్వరగా నేర్చుకునే అవకాశముంది. స్కూళ్లు, కాలేజీల్లోనే ఎక్కువ మంది దురలవాట్లు నేర్చుకుంటున్నారు. ఈ విషయం గుర్తించిన రాచకొండ పోలీసులు విద్యా సంస్థల్లో డ్రగ్స్ వినియోగాన్ని కట్టడి చేసేందుకు ప్రణాళికలు రచించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించడంతోపాటు వినియోగిస్తున్న వారిని గుర్తించి, కాపాడేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.

కాలేజీల్లో ర్యాగింగ్ భూతం జడలు విప్పుకున్న తరుణంలో విద్యార్థులే సభ్యులుగా రూపొందించిన కమిటీలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఇదే తరహాలో కళాశాల విద్యార్థులే సభ్యులుగా యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల్లో డ్రగ్స్ వంటి దురలవాట్లు మొగ్గదశలోనే తుంచేందుకు, ఈ కమిటీలు సహకరించనున్నాయి. తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ ఆధ్వర్యంలో బిట్స్ పిలానీ క్యాంపస్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ కమిటీల విధివిధానాలను ఖరారు చేశారు. విద్యార్థుల్లో పెరుగుతున్న డ్రగ్స్ అలవాటును వారితో చదువుకునే స్నేహితులు త్వరగా గుర్తిస్తారు. కళాశాలలో ఎవరైనా విద్యార్థి డ్రగ్స్ సేవిస్తున్నట్లు తెలుసుకున్నా ఈ కమిటీ సభ్యులు వెంటనే ఈ సమాచారాన్ని సంబంధిత అధికారులకు, అధ్యాపకులకు తెలియజేస్తారు. ఈ సమాచారాన్ని విద్యార్థి కుటుంబ సభ్యులతో పంచుకోవడం ద్వారా వారిని రిహాబిటేషన్ సెంటర్లలో చేర్పించడం ద్వారా డ్రగ్స్ బారి నుంచి కాపాడే అవకాశముంటుంది.

యువతలో డ్రగ్స్ వినియోగాన్ని కొంతవరకైనా అడ్డుకట్ట వేయాలని పోలీసులు భావిస్తున్నారు. యాంటి డ్రగ్ కమిటీల్లో చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, మెంబర్లుగా కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు ఉంటారు. పోలీస్, మెడికల్, లీగల్, ఎన్‌జీఓ, తల్లిదండ్రులు, విద్యార్థులు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది ఇందులో సభ్యులుగా ఉంటారు. వీరు తరచు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ, విద్యార్థుల్లో డ్రగ్స్ వినియోగంపై నిఘా పెడతారు. డ్రగ్స్ బారిన పడ్డ వారికి కౌన్సిలింగ్ సహాయంతోపాటు రివ్యూ నిర్వహిస్తారు.

బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికుల ధర్నా

సైదాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న పేషెంట్ కేర్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్‌లు, శానిటేషన్ కార్మికులు వేతనాలు చెల్లించాలని కోరుతూ మెడికల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించారు. మూడు నెలలుగా ఈగల్ సెక్యూరిటీ సర్వీసెస్ జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు పస్తులు ఉండటంతో పాటు అద్దెలు కట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు వాపోయారు. అంతేగాకుండా ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతాల్లో నగదు జమచేయడంలేదని, నిబంధనల ప్రకారం రావాల్సిన జాతీయ పండగల ఆర్జిత సెలవులు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్ శ్యాంకు వినతిపత్రం సమర్పించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో యూనియన్ నేతలు, కార్మికులు పాల్గొన్నారు

వేర్వేరు ప్రాంతాల్లో 173 కిలోల గంజాయి పట్టివేత

- విలువ రూ.46 లక్షలు
- ఐదుగురి అరెస్టు, పరారీలో ఆరుగురు

మహేశ్వరం/చేవెళ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, చేవెళ్ల ప్రాంతాల్లో గంజాయి ముఠాలు పట్టుబడ్డాయి. ఆ ముఠాల నుంచి రూ.46లక్షల విలువైన 173కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఐదుగురిని అరెస్టు చేయగా మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. వివరాలిలా ఉన్నాయి..

శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై ఆదివారం అక్రమంగా తరలిస్తున్న 109 కిలోల గంజాయిని మహేశ్వరం పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.30లక్షలు ఉంటుంది. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా నుంచి మెదక్ జిల్లాకు ఆటోలో గంజాయిని తరలిస్తుండగా మహేశ్వరం గేటు వద్ద పట్టుకున్నట్లు మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. ఆటోలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపూర్ మండలం తుమ్మల చెరువుకు చెందిన సోమరాకేశ్‌రెడ్డి, తాటి చంటిబాబును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కోర లోకేశ్, మెదక్ జిల్లాకు చెందిన బాణావత్ రాహుల్ పరారీలో ఉన్నారని డీసీపీ తెలిపారు.

- మరో ఘటనలో అక్రమంగా తరలిస్తున్న 64 కిలోల గంజాయిని సోమవారం చేవెళ్లలో పోలీసులు పట్టుకున్నారు.



పట్టుబడిన గంజాయి

చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన చిత్ర కైలాస్ మోహిత్, నౌనాథ్ గణపత్‌చౌహాన్, మాధన్ బాలసాహెబ్‌బయస్, రాజేష్ సుభాశ్‌మొహితే, రేఖ, మనోజ్‌సింగ్‌వీ, లాము పాలాఠీ ముఠాగా ఏర్పడి ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో చేవెళ్లలోని శంకర్‌పల్లి చౌరస్తాలో మహారాష్ట్రకు వెళ్లే లారీల కోసం ఎదురుచూస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి గంజాయితోపాటు ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు పారిపోయారు. వారి నుంచి రూ.16లక్షల విలువైన 64కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్రకైలాస్, నౌనాథ్ గణపత్, మాదన్‌లను రిమాండ్‌కు తరలించారు.



అవార్డుగ్రహీతలు, నృత్యకళాకారులతో అతిథులు, నిర్వాహకులు

స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్స్ ప్రదానం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోల్డెన్ స్టార్ యూత్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఐకాన్ అవార్డ్-2024 ప్రదానం కళాదీక్షితులు హాలులో జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని అవార్డులు ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాట్యగురువులు కేఎస్.రాజేశ్వరీశ్రీధర్, డా.యం.క్రిష్ణప్రియ శిష్య బృందం తమ నృత్య ప్రదర్శనతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మార్కెట్ చైర్మన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని సరూర్‌నగర్ ఆర్యవైశ్య సంఘం మీడియా కమిటీ చైర్మన్ శ్రీకాకోళ్ల రాజుగుప్తా అన్నారు. సోమవారం ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని కులాలతో పాటు వైశ్యులకు కూడా రాజకీయాలలో ఉండే హక్కు ఉందన్నారు. తూకాలలో మోసాలు జరిగితే, గిట్టుబాటు ధర లభించకపోతే చైర్మన్‌కు, కార్యదర్శికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలే కానీ ఇలా దాడులకు తెగబడటం సమంజసం కాదన్నారు. రైతులు ఆమెను కొట్టుకుంటూ తీసుకురావడం అమానుషమైన చర్యని అన్నారు. ఇప్పటి వరకు మార్కెట్ యార్డులో ఎందరో చైర్మన్‌లుగా చేసినవారున్నారని ఏ ఒక్కరిపై కూడా ఇలాంటి దాడులు జరుగలేదన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు శివ యాదగిరి, ప్రధాన కార్యదర్శి బిజ్జాల వేణు, కోశాధికారి బండారి సుధాకర్, సభ్యులు నేలంటి రవీందర్, యం.రాజు, ఎస్.రవి, వెంకటేశ్వర్లు, ఎర్రం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రమణాచారి దంపతులను సన్మానిస్తున్న జస్టిస్ శేషశయనరెడ్డి

'పరులకు సహాయపడితే పదవికి సార్థకత'

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రభుత్వ పదవులు చేపట్టి వుండవచ్చని, కానీ ఆ అధికారంలో ఉన్నప్పుడు పరులకు సహాయపడితే సార్థకత చేకూరుతుందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శేషశయనరెడ్డి అన్నారు. రమణాచారి వివిధ పదవుల్లో ఉన్న సమయంలో ఆయన సహకారం పొందిన వారు పదవీ విరమణ చేసిన తర్వాత కూడా జన్మదిన సందర్భంలో తమ అభిమానం చూపడం అరుదైన విషయమని పేర్కొన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఐఏఎస్ అధికారి డా.కేవీ.రమణాచారి జన్మదిన వేడుకల సందర్భంగా హాస్యానందం పత్రిక ఆధ్వర్యంలో జరిగిన కార్టూన్ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. చిల్ల రాజశేఖరరెడ్డి, పొత్తూరి సుబ్బారావు, లంక లక్ష్మీనారాయణ, కృష్ణమాచార్యులు, నిర్మల, వెంకటదాసు, గుదిబండి వెంకటరెడ్డి పాల్గొన్నారు. హాస్యానందం ప్రత్యేక సంచికను సంపాదకుడు పి.రాము లాంఛనంగా డా.రమణాచారికి అంకితమిచ్చారు. రమణాచారి దంపతులను జస్టిస్ శేషశయనరెడ్డి సత్కరించారు.



సీతానగర్ కాలనీలో గృహజ్యోతి వివరాలు సేకరిస్తున్న విద్యుత్ అధికారులు

అర్హులైన వారు గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చంపాపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి పథకంను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారులు కోరారు. సోమవారం బైరామల్‌గూడలోని సీతారాంనగర్‌కాలనీలో విద్యుత్ అధికారులు ఇంటింటికీ తిరిగి గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్యారగోని ప్రవీణ్‌గౌడ్, కొక్కొండ సూర్యప్రకాష్‌గుప్తా, దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ 200 యూనిట్ల లోపు వినియోగించే వినియోగదారులను కాంగ్రెస్ ప్రభుత్వం జీరో బిల్లు అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, మహేష్, కృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.